# సెకెండ్ హాండ్ జీవితం



దాక్షాయణి

ఆకాశం ఎర్రరంగు చీర సింగారించుకుని తన కొంగుమాటున సూర్యుణ్ణి సాగనంపుతూ, మరోవైపు చంద్రుణ్ణి ఆహ్వానిస్తోంది. గూడువదలిన పక్షులు కడుపులు నింపుకుని చంద్రుని రాక పూర్వమే యిల్లు చేరుకోవాలన్న హడావిడిలో గుంపులు గుంపులుగా ఎగురుతూ ఆకాశాన్నంతా ఆక్రమించుకుని, నిశ్శబ్దాన్ని భగ్నపరుస్తూ, తమ అరుపులతో అటు యిటు రదీగా తిరుగుతున్నాయి.

ఆరుబయట కుర్చీలో కూర్చునివుంది సుజాత శూన్యంలోకి చూస్తూ. చిట్టి తన చిన్నారి మాటలతో సుజాత కన్నీళ్లు తుడవ ప్రయత్నిస్తోంది. ఊయలలో బాబు ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

'నువ్వు వెళ్ళి ఆడుకో చిట్టి'

'మరి పూలు కట్టివ్వు'

'కట్టి పిలుస్తాగా, నువ్వెళ్ళు'

'మరేం కనకాంబరాలు నీకు, మల్లెలు నాకు. అమ్మఫోటోకి కనకాంబరాలు, మల్లెలు రెండూ...సరేనా' అంటుంటే కన్నీళ్ళు బలవంతంగా ఆపుకుంది సుజాత మౌనంగా పూలల్లుతూ.

సంధ్యారుణకాంతి అలుముకున్న గగనంలోకి చూస్తూ పూలు కట్టడం ముగించిన సుజాత అక్కడే కూర్చుండిపోయింది. ఆలోచనలమధ్య దుఃఖం ముంచుకువస్తుంటే స్వహస్తాలతో కన్నీరు తుడుకుంటోంది మాటిమాటికి.

లేత నీలిరంగు ఫుల్‌వాయిల్ చీర అదే రంగు జాకెట్ మెడలో ఒంటిపేట గొలుసు. నుదుట ఎర్రని తిలకం కంటికి చక్కని నల్లని కాటుక ఆమె అంత దుఃఖంలోనూ సంధ్యా కన్యలా ప్రకాశిస్తోంది. పరధ్యానంగా వున్న సుజాత తనని అలుకున్న బాహువుల స్పర్శతో ఉలిక్కిపడింది.

'నేను వచ్చాను రాజా' అంటున్న రఘు మాటలకు, వెనక్కి తిరగబోయిన సుజాత ఆగిపోయింది, అయోమయంగా.

'హటాత్తుగా ఊడిపడ్డానని ఆశ్చర్య పోతున్నావా' అంటూ తనవైపు త్రిప్పుకో పోయి టక్కున ఆగిపోయాడు రఘు.

రఘుని ఉలికిపాటుతో వదిలేస్తూ సుజాత చేతుల్లో ముఖం దాచుకొంది. కంగారెత్తి పోయాడు రఘు.

'సారి సుజాత, నేను రాజా అనుకున్నాను ప్లీజ్ మర్చిపో.'

'లోపలికి రండి బావా'

'యింట్లో ఎవ్వరు లేరా?'

'లేరు'

హాల్లోకి అడుగుపెడుతూనే ఊయల దగ్గిరకి వెళ్లాడు రఘు.

అచ్చు రజని (రాజు) లాగ వున్నాడనుకొని ప్రేమగా బాబు తలనిమురుతూ ఉండి పోయాడు.

'కాఫీ తీసుకోండి బావా' అన్న సుజాత మాటకి తలత్రిప్పి యాంత్రికంగా కప్పు అందుకొన్నాడు అతనికి రజనిని చూడాలని చాల ఉబలాటంగా ఉంది ఎక్కడికి వెళ్లిం దని సుజాతని అడగటానికి మొహమాట పడ్డాడు కాఫీ సిప్ చేస్తూ తలఎత్తిన అతనికి ఎదురుగా రజని ఫోటో సగం వడలిన పూలమాలతో కన్పించింది అతని చేతిలోంచి, జారి క్రిందపడి తునకలైంది కప్పు కుప్పలా కూర్చుని కుమిలి కుమిలి ఏడ్చాడు. అంతవరకు నిగ్రహించుకున్న సుజాత తనని తాను సంబాళించుకోలేక పోయింది. ఏ ఒక్కరు మరొకర్ని ఓదార్చ ప్రయత్నించలేదు. యిద్దరు కరువుతీర ఏడుస్తున్నారు.

పూలు పెట్టించుకుందామని ఆటమధ్యలో వచ్చిన చిట్టి తండ్రినిచూసి ఆగిపోయింది.

'డాడీ' అంటూ పరుగున వచ్చి అతన్ని చుట్టేసుకుంది చిట్టిని చూడగానే తన దుఃఖం ఉధృతమయింది.

'ఎందుకు దాడి ఏడుస్తున్నావు'

'మనకి అదే మిగిలిందమ్మా'

'ఏం మిగిలావన్నీ దొంగలెత్తుకు పోయారా' అమాయకంగా అడిగింది చిట్టి.

'కాదమ్మా మన సంతోషాన్ని చూడలేని దేవుడెత్తుకు పోయాడు' అంటూ ఆ పసి పిల్లని గుండెలకు అదుముకుంటూ బావురు మన్నాడు రఘు ఎడుస్తుంటే తనకి దుఃఖం ఆగక, తనూ ఎడుస్తూ కూర్చుంది చిట్టి.

కూతురు ఏడవటం గమనించి తన

# సెకెండ్ హేండ్ జీవితం

దుఃఖాన్ని తాను దిగమింగుకుంటూ ఆమెను ఓదార్చ ప్రయత్నించాడు.

'ఎందుకు ఏడుస్తున్నావు చిట్టీ'

'మరి నువ్వేడుస్తున్నావుగా'

'ఛ...లేదు నేనేడవటం లేదు'

'మరి కళ్ళలోంచి నీళ్లెలా పడ్డాయి'

'అవా...కంట్లో ఏంటో పడింది'

'పిన్నికి కూడానా'

'సరేకాని నీ ఫ్రెండ్ ఏది?'

'ఆడుతోంది'

'నువ్వు వెళ్లి ఆడుకోరాదమ్మా'

'మరి పిన్ని ఏడుస్తోందిగా'

దుఃఖాన్ని ఆపుకోటానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు రఘు.

'పిన్నికి తలనొప్పిగా వుందిట'

'మందు వేసుకోలేదా'

'ఊహుఁ...'

'అది కాదు నాన్నా నేను చెప్పనా పిన్ని ఎందుకేడుస్తోందో?'

'మంచిది చెప్పు'

'మరేం అమ్మని దేవుడెత్తుకుపోయాడే అందుకని. అప్పట్నుంచి ఏడుస్తూనే వుంది.'

'చిట్టీ...!!!' అంటూ హృదయానికి అదుముకుని హృదయవిదారకంగా ఏడ్చాడు రఘు.

'అమ్మ మళ్లి రాదని ఏడుస్తున్నావా నాన్న, అమ్మని దేవుడు బాగానే చూసు కుంటాడులే అమ్మ ఆకాశంలోంచి మన నెప్పుడు చూస్తుంటుందిగా. మనల్ని మర్చి పోదు. మనకి కావల్సినవన్ని దేవుడికి చెప్పి యిప్పిస్తుందిలే డాడి' అంటూ తన చిన్నారి చేతులతో తండ్రి కన్నీటిని తుడుస్తూ తనని తాత ఓదార్చినటు తండ్రిని ఓదా ర్చింది చిట్టి. పాపం ఆ పాపకు ఒకరు చెప్పందే తనకా ఆలోచనలన్నీ ఎక్కడివి మరి?

తల్లిని మరిపించే పిన్ని, కథలు చెప్పే తాతయ్య, మిఠాయి పెట్టే అమ్మమ్మ ఏడుపుతో పలకరించే చిన్నారి తమ్ముడు వాళ్ల మధ్య తల్లిలేని లోటు, అందరు తల్లికోసం విలపించటం ఆ పిల్లకి వింతగా బోధపడనట్లుగా వుంది.

రఘు పరిస్థితి మరీ అధ్వానంగా వుంది. అతను ఎన్ని ఆశలతో వచ్చాడో, అన్నీ నేల కూలాయి. అడగలేక అడిగాడు.

'నాకెందుకు తెలియచేయలేదు సుజాతా.'

'క్షమించండి బావా, మీరా సమయంలో జాన్‌డిస్‌తో బాధపడుతున్నారు, దాని తరు వాత వెనువెంటనే వచ్చిన ట్రాన్స్‌ఫర్ మీకు తెలియజేయడంమాకు యిష్టంలేకపోయింది.

అంతకన్నా ఎక్కువ అతను అడగలేదు. ఓ వారంలో రజనికి పురుడు వస్తుందనగా రఘు వచ్చి చూసి వెళ్లాడు. ఆ వెళ్లినవాడు పచ్చకామెర్లు వచ్చి మంచాన పడ్డాడు. బాబును కని ఈ లోకాన్ని వదిలిన రజని సంగతి అతనికి తెలియదు. నెలరోజులు హాస్పటల్లో ఉండి బయటపడేసరికి ట్రాన్స్ ఫర్ ఆర్డర్స్ రెడిగా వున్నాయి. ఎక్కువ శ్రమ పడవద్దని స్ట్రిక్ట్‌గా డయట్ మేన్ టేన్ చేయమని చెప్పడంవల్ల తిరిగి హైదరాబాదు. రాకుండ విజయవాడనుండి కేరళకి వెళ్లిపోయాడు. ఎలాగో తంటాలు పడి ట్రాన్స్‌పర్ కాన్సిల్ చేసుకుని స్థిర పడేసరికి మూడునెలలు గడిచిపోయాయి. తను వచ్చేసరికి రజని బాబుతో ఎదురవు తుందని బారసాల చేసుకుని విజయవాడ తీసుకొచ్చేయాలని అనుకున్నాడతను.

రజని ఫోటో వంకే చూస్తున్న అత నికి సుజాత పూలదండ అందించింది. మౌనంగా రజని ఫోటోకి పూలమాల వేసి క్షణకాలం అలాగే నిల్చున్నాడు శిలా ప్రతిమలా.

* * *

పెళ్లి దగ్గర పడుతున్న కొద్ది సుజా తలో, ఏదో సంఘర్షణ. మాటిమాటికి కళ్లలో నీళ్లు తిరిగేవి. ప్రయత్నాన్ని ఆపి వేసేది. ఏది చూచినా ఆమెలో రగిలే దావాగ్ని ఆమె మనసును దహించివేస్తుంటే. చిట్టి అమాయకపు చూపులు మాటలు మనసును వశపరుచుకుంటాయి. బాబు రోదన హృదయాన్ని స్పందింప చేస్తుంటే, తన బాధని కన్నీటికి అర్పితం చేసి ముందు జీవితాన్ని ఎలా అహ్వానించాలో అర్థంకాక సతమతమవుతు నిమిషాలు యుగాలుగా మారాలి అని వేడుకొంది భగ వంతుని.

కాని అన్నిటికన్న తన పని తను చూసు కునే కాలం ఎవరికోసం ఆగలేదు. సుజాత, రఘు ధర్మపత్ని అయ్యింది.

'సెకెండ్‌హేండ్ పిల్లలు, సెకెండ్‌హేండ్

భర్త 'సెకెండ్‌హేండ్ జీవితం' తన బ్రతుకే సెకెండ్‌హేండ్ అన్నీ. అక్కతరువాత తనకి వారసత్వంలా సెకెండ్‌హేండ్‌లో రావల్సిందే. అది కనీసం పెళ్లి విషయంలోను తప్పలేదు తను చిన్నప్పటినుండీ సెకెండ్‌హేండ్ జీవితం గడిపింది. అక్క తొడుక్కున్న గౌను, చిన్న దయితే తను వేసుకుంది. అక్కవాడిన పుస్తకాలు తిరిగి తను చదివింది. అవి ఎంత జీర్ణదశలోవున్నా అక్క ఏది కొన్నా అది పూర్తిగా పాడయ్యేలోపల' జీర్ణావస్త లోనే తన చేతుల్లో అంతం కావల్సిందే అది మామూలు విషయమే. తనని ఏడ్పించిం దెవరు ? స్నేహితురాండ్రు తనని వెక్కిరిస్తే వచ్చిందేగాని వెనక దాగివున్న సత్యం, ఆమె మనసును దహించి వేసింది.

తను ఏదయినా 'భలే బావుందే అది నేను కొంటా' అంటె చాలు ఏమనేవారు తన నేస్తాలు 'ఎందుకు సుజా శుద్ధ దండగ, మీ అక్క చేతుల్లోంచి నీ చేతు ల్లోకి వచ్చేటప్పటికి ఫాషన్ కూడ పోతుం' దని. తను బాధపడినా, అలవాటవ్వటంవలన ఓ నవ్వు నవ్వేది.

ఆ రోజు... తనకి బాగా గుర్తు బొంబే నుండి తెచ్చిన జోళ్ళు అక్క రెండుసార్లు వేసుకుందో లేదో, జోళ్ళు కొనుక్కోవా లంటే, అవి తనకిచ్చి తానే క్రొత్తవి కొను క్కుంది. తన ఫ్రెండ్స్ తననిచూసి అప్పుడు జాలి ప్రకటిస్తే అందులో ఏం తప్పని వాదించేది. ఇంట్లోవాళ్ళు సర్దుకోకపోతే ఎలా? అని ఉపన్యసించేది. కాని యిప్పుడు తలచుకొన్నకొద్దీ గుండెలు బ్రద్దలై దుఃఖం ముంచుకొస్తోంది.

'నువ్వా నీ సెకెండ్‌హేండ్ జీవితం' అని బాధపడే తన ఫ్రెండ్ రమ గుర్తుకొస్తోంది. ఆ బాధ తనకప్పట్లో అర్థం అవలేదు.

ఇప్పుడు తను అక్కచేస్తి వదలిన భర్తతో తను కాపురం చేయాలి. ఆమె కన్న పిల్లల్ని తను తల్లి అయి సాకాలి ఆమె తిరగాడిన యింట్లో తాను తిరుగాడాలి. ఆమె ధరిం చిన నగలు, కట్టిన చీరెలు, తను ధరించాలి, కట్టాలి, ఆమె చేసినవన్నీ తనూ చెయ్యాలి. ఆమె ఆ యింటిని నడిపిన విధంగా తాను నడపాలి ఆమె నడుచుకొన్నట్లు నడుచుకో వాలి ప్రతిదీ ఆమె ననుసరించాలి.

'భగవాన్ ఈ సెకెండ్‌హేండ్ జీవితం ఎందుకు ప్రసాదించావు నీవు ?' అంటూ

# సెకెండ్ హేండ్ జీవితం

దీనంగా భగవంతుని తలచుకుంది, ప్రక్కన కూర్చున్న సెకెండ్‌హేండ్ పెళ్ళికొడుకు అయిన బావగారి ప్రక్కన కూర్చుని

నాకు ఈ పెళ్ళివద్దని అరవాలనిపించింది. కాని .. 'పిన్నీ' అని ఆప్యాయంగా పిలిచే చిట్టి, బోసినవ్వులబాబు, ఆమె నోరు నొక్కేసారు. సవితతల్లిపోరు వాళ్ళకి తప్పా లని రఘుకి భార్యకావాలని ఒప్పుకుంది అతని యిష్టాయిష్టాల గురించి ఆమె ఆలోచించలేదు అతనిని ఆమె యెప్పుడు ద్వేషించలేదు గౌరవించేది. ఇప్పుడు ఆరా ధించవలసిందే. గొంతులోనే ఆగిపోయిన పిలుపు మెళ్ళో మాంగల్యం పడడంతో అధఃపాతాళానికి అణిగిపోయింది.

అమ్మ నాన్న ఈ పెళ్ళి నీకు యిష్టమా అడిగినప్పుడు సిగ్గుపడింది బాధ ప్రక టించడానికి బాధపడి, చెప్పాలనుకున్నది చెప్ప లేక. శిలాప్రతిమలా అయిన ఆమె, దీక్షగా అగ్నిహోత్రుని చూస్తూ వుండింది. అక్షింతలు పడడంతో ఉలిక్కిపడి తేరుకుంది.

తనలో మిగిలిన బాధకు కారణం ఏమిటో ఇన్నాళ్ళు అర్థంకాని ఆమెకు ఈ క్షణంలో తనిప్పుడు రఘు భార్యనన్న విషయంతో అర్థమైంది. అంతవరకు తలవంచుకుని కూర్చున్న సుజాత పురోహితుడు ఏదో చెప్ప డంతో అది చేయడంలో నిమగ్నమైంది. స్నేహితురాలి అమాయకత్వానికి, రమ మనస్సు వికలమైంది. పెళ్ళి అని ముందే తెలిస్తే ఆమెకి ఎంత నచ్చచెప్ప ప్రయత్నిం చేదో కాని రెండురోజుల్లో పెళ్ళనగా అందింది తనకి శుభలేఖ. దొరికిన శెలవుని ఉపయోగించుకుని, ఆమె బయలుదేరి వచ్చే సరికి పెళ్ళికూతుర్ని చేస్తున్నారు ఒంట రిగా కలిసి నాలుగు దులిపింది సుజాతని, రమ.

'నీకు లేదు మీ అమ్మవాళ్ళకైనా వుండ క్కర్లే బుద్ధి' కోపంగా అంది

'వాళ్ళ తప్పు కాదు రమా, నేనే ఒప్పు కున్నాను' బాగా ఆలోచించే ఈ నిర్ణయాని కొచ్చాను, అని సుజాత చెప్పినప్పుడు రమ కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

బావని చేసుకోవడం తప్పు కాకపోవచ్చు. కాని ఆత్మవంచన చేసుకుంది సుజాత. ఏదో భ్రమలో ఆవేశంలో పెళ్ళికి ఒప్పుకుంది. తీరా పెళ్ళయినాక ప్రతిదానికి గుర్తుకు వచ్చి పిచ్చిపిచ్చి ఆలోచనలతో మనస్సు పూర్తిగా పాడుచేసుకుంది. అదే రమ బాధ. నిజంగా మనస్ఫూర్తిగా సుజాత పెళ్ళికి ఒప్పుకుని వుండుంటే, ఆమె నిజంగా, ఆమె త్యాగానికి ప్రశంసించేదే, కాని ఆమెకు తెలుసు సుజాత తొందరపాటు. ఏదేమయితే నేమి? సుజాత అత్తగారింటికి (అక్కగా రింటికి) తరలివెళ్ళింది కుడికాలు ముందు వేసి నడిచి యింట్లోకి అడుగుపెడుతున్న ఆమె ఎదురుగా రజని ఫోటో చూసి ఆగి పోయింది. ప్రతి చిన్నదానిలో అక్క అభిరుచి, అక్క నేర్పరితనము ప్రకటిమవుతుంటే చూచి భరించలేకపోయింది గారాలుపోయి, అల్లరిచేసి మొండిపట్టుపట్టి తమవెంట బయలుదేరిన చిట్టిని దగ్గరకు తీసుకుని స్వయంగా అన్నంపెట్టి, తాతయ్యబదులు తాను కథలుచెప్పి చిచ్చికొడ్తూ నిద్ర పోయింతరవాత తాను నిద్రపోయేది. ఒక ప్రక్క బాబు మరోవక్క చిట్టి.

నీళ్ళకోసం వచ్చిన రఘు ఆ దృశ్యం చూసి క్షణకాలం నిశ్చలంగా నిల్చుండిపోయాడు. చాల బాధపడ్డాడు. సుజాతమీద అతని గుండె జాలితో నిండిపోయింది. అతను నీళ్ళ సంగతికూడ మర్చిపోయి బాధతో వెనుతిరిగి వెళ్ళిపోయాడు.

మనస్సు ఎన్నివిధాల వెక్కిరిస్తున్నా పైకి కనబడకుండా తనపని తను చేసుకుంటూ వెళ్తోంది సుజాత. చిట్టి మాటలు, అల్లరి ఆమె మనస్సును ఆకట్టుకున్న ప్రతిదాని లోను అక్కరూపం కనబడి తన సెకెండ్ హేండ్ జీవితానికి బాధపడడం మాత్రం ఆమె మానలేదు సాఫీగా వారంరోజులు గడిచిపోయాయి. ఈ వారంరోజులలో భర్తకి కావల్సిన విచ్చడమే తప్ప ఆమె అతనితో మాట్లాడలేదు తన బ్రతుకు అక్క పిల్ల లతోనే గడుస్తే చాలనుకుంది, సుజాత. భర్త దగ్గరనుంచి ఏమి ఆశించలేదు ఎలా గయిన తన జీవితం గడుస్తేచాలని ఆమె కోరిక. ఆనాడు చిట్టిని కూర్చోపెట్టి కథలుచెప్పి నిద్రపుచ్చ ప్రయత్నిస్తోంది సుజాత గంట పదిఅవుతోంది రఘు ఇంకా యింటికి రాలేదు చిట్టి నిద్రపోయింది. పద కొండుగంటలకి తూలుతూ వచ్చాడు రఘు. హడలిపోయింది సుజాత, భయంవేసింది కూడ. గజగజ వణికిపోయింది. సరాసరి

బెడ్‌రూంలోకి వెళ్ళి తలుపులు మూసుకొన్నాడు రఘు. హృదయం బ్రద్దలయ్యేలా యేడ్చింది. ఎప్పుడు పడుకుందో మరి తెల్లవారేసరికి లేచింది. రఘు మామూలుగ లేచి తనపని తను చేసుకుని సుజాత వడ్డించింది తిని ఆఫీసుకు వెళ్ళిపోయాడు. సుజాత ఆ పూటకూడ అన్నం తినలేదు అక్క మరణానికి బావ దిగజారి పోవలసివస్తే, మరి తనని ఎందుకు పెళ్ళిచేసుకున్నట్టు? పిల్లల కోసమా?. యింక ఆలోచించలేకపోయింది

ఆరోజు సాయంత్రం పెందరాడే వచ్చేసాడు రఘు అతనిచేతిలో ఒక నగలపెట్టె తెచ్చాడు. ప్రప్రథమంగా, సుజాతని ఆరోజు పలకరించాడు.

'సుజా!' బాబుని ఊయలలో ఊపుతున్న సుజాత 'ఏమి?'అన్నట్లు చూపింది.

'యిలా వస్తావా ఓసారి' అతని ప్రక్కగా వెళ్ళి నిల్చుంది

'ఈ నెక్‌లేస్ బాగుందా?' అట్టపెట్టె తెరిచి చూపాడు.

'బాగానే వుంది' ఆ నగపై ఆసక్తి లేనట్టుగా నిస్పృహగా యిచ్చింది జవాబు.

'పోని ఏ డిజైనైతే బాగుంటుందో చెప్పు' కుతూహలంగా అడిగాడు.

'నా కంత బాగా తెలియదు.'

'కాటలాగ్ తెప్పించనా'

'అసలిప్పుడు నాకు నగలెందుకు?'

'మరీ బావుంది ఎందుకేమిటి? పెట్టుకోడానికి.'

'అక్కవున్నాయిగా' వస్తున్న దుఃఖాన్ని ఆపుకొంటూ అంది.

'నీకంటూ ఏమీ అక్కరలేదా?'

'ఊహుఁ.. వద్దు... చిట్టికి కావలంటే ఏమయినా చేయించండి.'

'చిట్టికి చేయిస్తాన్లే ఈసారికి నువ్వు తీసుకో' ఆప్యాయంగా అన్నాడు.

'అయినా రజని అయితే నలుగురమ్మలక్కల నడిగి మంచి డిజైన్ సెలెక్టు చేయించుకుని యిప్పుడు వద్దన్నా అది తప్పక చేయించుకునేది నువ్వేమీ అసలు వద్దంటున్నావు.'

'......... ..'

'సరే నేనే ఏదో ఒకటి తెస్తాలే రేపు మావాళ్ళు ఎవరైనా తెస్తారు తీసుకో' అంటూ వెళ్ళిపోయాడు.

సుజాతకి ఒక్కక్షణం సంతోషం కలిగింది, తన ఫస్ట్‌హాండ్‌లో ఒక నగ కొనుక్కోపోతున్నందుకు కాని ఆసంతోషం ఎంతోసేపుండలేదు. రాత్రి జరిగిన సంఘటన జ్ఞప్తికి వచ్చింది

మర్నాడు రఘు అన్నట్టుగానే ఒకతను వచ్చి అట్టపెట్టెనిచ్చి 'అయ్యగారు యింటి దగ్గిర యిచ్చి రమ్మన్నారు మీ సెలక్షన్ బాగుంది' అంటూ అందించాడు యాంత్రికంగా అందుకుంటూ అతనిని పరిశీలించింది గొప్పవాడిలానే ఉన్నాడు నగలషాపు గుమాస్తానేమో అనుకుంది. అతను వెళ్ళిపోతూ అన్నాడు, 'చూడండమ్మా అయ్యగారికి చెప్పి నా పని తొందరగా అయ్యేట్లు చూడండి. యింకో ఆఫీసరు యింట్లో యిప్పుడే యిచ్చి వచ్చాను యిదేమాదిరి నెక్‌లేస్, వస్తానమ్మా నమస్కారం' అంటూ నమస్కరిస్తూ వెళ్ళిపోయాడు. అచేతనంగా నిలబడిపోయింది సుజాత. ఏమిటిది ఆయన చేస్తున్నది? ఇది పుచ్చుకున్నది లంచమా? ఆలోచించలేక వెక్కెక్కి ఏడ్చింది.

చిట్టి స్కూలునుండి వచ్చింది సుజాత తనతో సరిగా మాట్లాడలేదు ఆమెలో మండుతున్న దావాగ్ని ఆ పసిపిల్ల వెంటబడి తిరుగుతున్నా పలకరించినా చల్లారలేదు పాలు త్రాగనని మారాం చేస్తున్న పాపని కోపం చల్లార్చుకోలేక కొట్టింది చిట్టి తట్టుకోలేక రాగాలు తీసింది తండ్రికి ఫిర్యాదు చేస్తానని బెదిరించింది. ప్రక్కింటి లక్ష్మి వచ్చింది.

'చిట్టి ఆడుకుందాం రావా.'

'ఊ...హుఁ...' ఏడుస్తూ జవాబిచ్చింది.

'మీ అమ్మ నిన్నెప్పుడు కొట్టలేదు కదూ, మీ పిన్ని చెడ్డది'

వినలేకపోయింది సుజాత. దిండులో తల దూర్చి విలపించింది. రఘు వచ్చిన సంగతి ఆమెకి తెలియదు సుజాత దుఃఖం అతని గుండెల్ని పిండేసింది.

'సుజా ఛ ఏమిటిది. ఏం జరిగింది? ఏమయ్యిందో నాకు సరిగ్గా చెప్పు' అంటూ తనవైపు తిప్పుకొన్నాడు.

'నిజంగా చెప్పాల్నా.'

'చెప్పు సుజా, నువ్వేమి చెప్పినా నాకు కోపం రాదు, చెప్పు.'

'మీరెందుకు? నిన్నరాత్రి త్రాగారు. యివాళ నగ పంపించారు ఎందుకు?'

'సుజా నీకు తెలీదా! అప్పుడప్పుడు పార్టీలకు వెళ్ళినప్పుడు త్రాగుతానని'

'ఊఁ.. హు .'

'లంచం తీసుకుంటానని కూడ తెలీదా.'

తెలియదన్నట్లు తలాడించింది

'నీకు మీ అక్క ఎప్పుడు చెప్పలేదా.'

'చెప్పలేదం'ది సుజాత.

'సుజా! నీకు నిజం చెప్తున్నా నమ్ము నమ్మకపో నాకు ముందు దురలవాట్లు లేవు మీ అక్కకి నగలపిచ్చి నాగరికత పిచ్చి ఫ్యాషన్ ప్రాణం గొప్పతనం అవసరం నాతోటి ఆఫీసర్తో నేను చేయి కలపలేదని ఆయన నన్ను మార్చ ప్రయత్నించారు. ఆయన భార్యామణి ఆయనికి తగ్గదే. ఎక్కడలేని నగలు, గొప్ప నగలు తమదగ్గరున్నాయని చూపి మీ అక్కని రెచ్చగొట్టింది. నన్ను సాధించడం మొదలెట్టింది మీ అక్క. ఆలోచిస్తే కాలంతో అది ఎంత కామనో నా కర్థమైంది. ఆఖరికి ప్యూనుకి క్లర్కుకికూడ ఏదోవిధ గా అందుతునే వుంటుంది. నేనూ అలవాటు పడ్డాను. ఎన్నో పార్టీలకి డిన్నర్లకి వెళ్ళేవాళ్లము అందరూ డ్రింక్స్ పుచ్చుకుంటుంటే నేను మర్యాదగా పుచ్చుకొనేవాడ్ని అది మీ అక్కకు నామోషిగా అన్పించింది. తన భర్త అందరితో, తాగాలి లంచం పుచ్చుకోవాలి, అందరికన్నా ఎక్కువ నగలతో మంచి చీరలతో తన గొప్పతనాన్ని ప్రకటించుకోవాలి. ఇవి మీ అక్క ఆశయాలు కావచ్చు. నేనూ అలవాటుపడ్డాను కాని యింకొకటి. తనన్నది నేను చేయలేదు. నాకనిపించింది నేను చేసాను. నీకీ విషయాలు తెలుసునేమో అనే నేను అనుకున్నాను. ఎంతైనా ఆడవాళ్ళనోట్లో మాటలు నిలవవుగదా? అటువంటిది మీ అక్కదగ్గర నిల్చిందంటే ఆశ్చర్యంగా వుంది. సుజా! నన్ను క్షమించు ప్లీజ్ నీకీ విషయాలన్ని తెల్పని నేనేమి చెప్ప ప్రయత్నించలేదు.

దుఃఖం తగ్గలేదు సరిగదా ఉన్నతమయింది సుజాతకి.

తన బాధనంతా ప్రేళ్ళగ్రక్కేసుకుంది. ఆఖరికి తన భర్తలోని అభిరుచులు అలవాట్లుకూడ సృష్టించిందే. ఇప్పుడు దాని కన్నా అలవాటుపడాలి. ప్రతి కదలికలో

అక్క, ప్రతివిషయంలో అక్క 'భగవాన్ నన్నెందుకు అక్కకి చెల్లెల్ని చేసావు?' విలపించి నీరసించిపోయింది సుజాత.

'లే సుజా! ఏడవకు నీ మనసుని నొప్పించిన పనులు సాధ్యమైనంతవరకు నేను చేయనులే. క్రమంగా మార ప్రయత్నిస్తాను. నువ్వు నా పిల్లలకోసంచేసిన మంచిలో, నా మంచికోసం కూడ నేను మారడం ఒక లెక్కకాదు. లేలే చిట్టికి ఏవో కొనాలన్నావు పద, ముఖం కడుక్కో' అన్నాడు రఘు.

రేపు చిట్టి పుట్టినరోజు మరి నిజంగా మారుతారా అన్నట్టు చూసింది.

'నమ్మ సుజా! నేను మరీ అంత చెడ్డ వాడ్ని కాదులే, అసలు నిన్ను చేసుకో వాల్సిందిపోయి పొరపాటున మీ అక్కను చేసుకున్నాను అయినా నాకు తన అభిరుచులు తెలియలేదుగా. ఇదుగో ప్రామిస్‌చేస్తున్నా మార ప్రయత్నిస్తాను చాలా!' అన్నాడు ఆమె చేతిలో చేయి వేసి ఆప్యాయంగా, మెల్లిగా నొక్కుతూ సుజాత దుఃఖం తక్షణం ఎగిరిపోయింది. లేచి తొందరగా ముస్తాబైంది. రఘుపట్ల సుజాతకు ఆరాధన క్షణక్షణానికి నిండి పోతుంది.

'ఇక వెళ్దామా!' అంటూ వచ్చిన సుజా తని చూచి తృప్తిగా నవ్వుకొంటూ ఆమె వంక చూసాడు తెల్లని కాశ్మీర్ సిల్కుచీర తెల్లటి జాకెట్, మెళ్ళో ముత్యాలు, జడలో స్వచ్ఛమైన మల్లెపూలు. నిజంగా స్వచ్ఛమైన మల్లెలాగానేవుంది తను కూడ. ఆమె రూపు చూపు రఘుని మత్తెక్కిం చాయి అతను, సుజాత పెదాలని పవిత్రం చేసాడు. ఆమె మనస్సు మయూర నాట్యం చేసింది. కాని మరుక్షణమే ఆమె తలలోని పూలుకూడ సెకెండ్‌హాండ్ అని గుర్తొచ్చి తన ఉత్సాహాన్ని చప్పగా చల్లార్చింది. రజ నికి తెచ్చిపెట్టిన ఆ పూలు రఘు తనకి పెట్టుకొమ్మని యిచ్చాడు

రఘు ఉత్సాహంగా చిట్టికి అన్ని కొన్నాడు.

చిన్న ముత్యపు ఉంగరం కొని సుజాత వేలికి తొడిగాడు.

'సుజా! భయపడకు యిది నా స్వార్జితం లోనిదే!' అంటూ చిన్నగా నవ్వాడు

రాత్రి నిద్రలో సుజాత కలవరించింది.

'అక్కా నాది సెకెండ్‌హాండ్ బ్రతుకు కదూ! నాకు సెకెండ్‌హాండ్ భర్త కదూ! నాకు సెకెండ్‌హాండ్ పిల్లలు కదూ! అయినా ఫరవాలేదక్కా. వాళ్ళని నేను బాగ చూసు కుంటాను. నాకు వాళ్ళే కావాలి.

బావ మంచివారు ... నీవెందుకక్కా ... ఆయనని అలా మార్చావు. నేను మళ్ళీ బావని ఫస్టుహాండుగా మారుస్తానుండు. ఇంకమీదట నాకు సెకెండ్ వద్దు. అన్ని మారుస్తా. క్రొత్తగచేస్తా సెకెండ్‌హాండ్ లేదక్కా. అన్ని మార్చేస్తా నా బావని కూడ' అంటూ పిచ్చిగా ఏదో మాట్లాడు తూనే వుంది. రఘుకి కళ్ళలో నీళ్ళు తిరి గాయి. ఆమె బాధ అర్థమైందతనికి. అత నికి ఆమెమీద బాధతోపాటు ప్రేమకూడ పెరిగింది. తలని నిమురుతూ,

'నేను నీకు అండనే సుజా అన్ని మార్చేయి, సెకెండ్‌హాండ్ వద్దు సెకెండ్‌హాండ్‌వద్దు' మెత్తగా ఆమె నుదుటిమీద ముద్దుపెట్టుకుంటూ గొణి గాడు రఘు. ●

